


# రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్షపత్రిక

05-8-2001 (16)



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్. పిన్ : 534 265

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 03-08-2001 To 10-08-2001 | హైదరాబాద్ కేంపు | |
| 15-08-2001 | అప్పనపల్లి | వెంకటేశ్వరస్వామి దేవస్థానం, తూ॥గో॥ జిల్లా |
| 19-08-2001 | ఆకివీడు | శ్రీ దత్తాత్రేయ ఆశ్రమం |
| 23-08-2001 | గెద్దనపల్లి | వయా అమలాపురం, మహపాల్ చెరువు, తూ.గో.జిల్లా |
| 27-08-2001 | మహదేవపట్నం | |
| 30-08-2001 | కోలమూరు | వయా ఉండి |
| 02-09-2001 | జిన్నూరు | శ్రీ రమణ క్షేత్రం |
| 17-09-2001 | బలుసుపాడు | గురుధామ్ ఆశ్రమం, జగ్గయ్యపేట దగ్గర, కృష్ణా జిల్లా |
| 23-09-2001 | జిన్నూరు | శ్రీ రమణ క్షేత్రం<br>సద్గురు శ్రీ నాన్నగారి 68వ జన్మదిన మహోత్సవం |





## సద్గురు శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవములు

పాలకొల్లు, బ్రాడిపేట రెండవ వీధిలో వేంచేసియున్న
సద్గురు శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో 330వ ఆరాధనా మహోత్సవములు
ది.5-8-2001 నుండి 7-8-2001 వరకు అత్యంత వైభవంగా జరుగునని
శ్రీ రాఘవేంద్ర స్వామి సేవాసమితి అధ్యక్షులు పి. లక్ష్మీనారాయణ (ఆడిటర్) గారు
మరియు కార్యదర్శి బి.ఎస్. ఆనందరావు(ముద్దు) గారు తెలియజేసినారు.



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 6 సంచిక : 16 పుష్పం : 48-50 5-8-2001

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 16

**VOL : 6** **ISSUE : 16**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 140/-**
Each Copy : **Rs. 10/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## నామము

నిదురయందు మనస్సణిగినప్పుడు, మనము సుఖము అనుభ విస్తున్నాము. అపుడు మనము ఏకముగా ఉన్నాము. దేహముతోను, ఇంద్రియాలతోను విడివడి సుఖముగా ఉన్నాము. ఆ స్థితిలో మనకు ఇతరులు లేరు. అందుచేత మనస్సుతోను, దేహముతోను సంబంధము లేని నిద్రాస్థితిలో మనము ఒకటిగా, సుఖముగా ఉన్నాము. ఈ స్థితిలోఇంద్రియాలనుండి విడివడ్డాము కనుక సుఖముగా ఉన్నాము అని చెప్పటకు ఇంద్రియములు మన ఆధీనములో ఉండవు, కనుక సుఖముగా ఉన్నాము అని నిద్రలో ఉండగా మనము చెప్పలేము. కాని జాగ్రదవస్థలో దేహస్మృతి కలిగిన తరువాత నిద్రలో ఉండగా నాకు ఎంతో సుఖముగా ఉన్నదని, ఇంద్రియాల సహాయముతో మనము చెప్పగలుగుతున్నాము. అందుచేత మన స్వరూపము, ఒకటిగా ఉండే అనంతమైన సుఖస్వరూపము. సుఖస్వరూపానికి మొదటిపేరు "నేను ఉన్నాను" లేక "నేనున్నా నదిగా నున్నాను" (I am that I am) "నేను", "నేను" అని సుఖ స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకొని మనం స్మరిస్తే సుఖస్వరూపాన్నుంచి తప్పకుండా స్పందన వస్తుంది. శరీరము పుట్టినప్పుడు మనకు నామం లేదు, కాని తరువాత ఒక నామంతో పిలిచినపుడు మనం స్పందిస్తాము.

**ఈ సంచికలో......** *సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు*

11-04-2001 ఐ. భీమవరం ........ 3
05-07-2001 జిన్నూరు ........ 6
31-07-2001 పాలకొల్లు ........ 11

నామము, మనము వేరుకాదు. అట్లే అనంతమైన సుఖస్వరూపమునకు మనకు, ఇష్టమైన నామముతో స్మరణ చేసినపుడు, దానినుండి తప్పకుండా స్పందన వస్తుంది. నామం వేరు, సుఖస్వరూపము వేరు కాదు. కాని నామం చేసేటప్పుడు యాంత్రికంగా చేయకూడదు. అనన్యమైన భక్తితో, నామజపం చేసినప్పుడు, సత్ఫలితాలు తప్పక వస్తాయి. నామం చేయగా, చేయగా మన శరీరంలో ప్రాణశక్తితో, మనం జపించే బీజాక్షరాలు ఏకమవుతాయి. ప్రాణశక్తి మంత్రంలో ఏకమయినప్పుడు, మంత్రం సుఖస్వరూపానికి విడిగా లేదు కనుక ప్రాణం సుఖస్వరూపంలో కలిసిపోతుంది. ప్రాణం సుఖస్వరూపములో కలిగినప్పుడు, చిజ్జడగ్రంథి విచ్ఛేదమయి, "నేను దేహమును" అనే మొదటి తలంపు నాశనమయి, సుఖస్వరూపము మనకు గోచరిస్తుంది. ఇట్టి స్థితిలో శరీరములో బంధింపబడిన ఆభానచైతన్యము ఆత్మనాడిలో కేంద్రీకృతమై, స్వయంజ్యోతిగా వెలుగుతూ "నేను ఉన్నాను" అని సహజముగా తెలుస్తూ ఉంటుంది.

అందుచేత నామము మన సుఖస్వరూపమునకు పేరు, నామము చేసినప్పడు, చిత్తశుద్ధి కలిగి, అనాత్మ నుండి మనం విడివడి, చిజ్జడగ్రంథి విచ్ఛేదమయి, మనం ముక్తి పొందుతాము. నామం జపించాలనే బుద్ధి మనకు దేవుని అనుగ్రహము వల్ల మాత్రమే వస్తుంది. ఆత్మసిద్ధి పొందినవారు, మనకు నామం ఇచ్చినప్పడే, అది మనమీద ప్రభావం చూపి ముక్తికి దారితీస్తుంది.

నామం ప్రగతి పొందినపుడు, నామం మనోమూలంలో కలిసి అంతరంగంలో అహంస్ఫురణ "నేను", "నేను" గా నిరంతరం, తెంపులేకుండా స్ఫురించటం మనం గుర్తిస్తాం. నామం అప్రయత్నంగా జరిగే వరకు నామం చేస్తూ ఉండాలి. నామంవల్ల, మనస్సును ఒక తలంపుకు మాత్రమే పరిమితం చేయవచ్చు. నామం అప్రయత్నంగా (Spontaneous), తైలధారవలె (Without Break), అంతంలేని సెలయేరులా కొనసాగటమే ముక్తి అదే సాక్షాత్కారం. జపం తైలధారలా, అంతంలేని సెలయేరులా కొనసాగుతుంది. జపం చేసేటప్పడు ఉన్న మానసికస్థితి, విషయాత్మకం కాదు కనుక, అది మన సహజస్థితికి దారితీస్తుంది. నామ, రూపాలతో తాదాత్మ్యం ఉన్నంత వరకు, జపం తప్పదు, జపం మానసికం అయినప్పడు దానిని ధ్యానము అంటాము. నామ, రూపాలతో తాదాత్మ్యం పోయినప్పడు, జపం దానికదే రాలిపోతుంది.

శాస్త్రాలవల్ల, వ్రతాలవల్ల నామం తెలియబడదు. శరణాగతి పొందిన తరువాత "నేను ఉన్నాను" అనే నామం తెలుస్తుంది. నేను మూలం తెలిశాక, వ్యక్తిత్వాన్ని, మూలంలో కలపాలి. అట్టి నామము అనగా "నేను ఉన్నాను", పరబ్రహ్మమే, దానిలో ద్వైతం లేదు. భక్తి, విచారణ, జపం అనాత్మకు దూరంగా ఉండటానికే "నేను" అనేది ఉత్తమమైన నామము.

Dr. P.V.S. సూర్యనారాయణ రాజు

**భగవంతుని సంకల్పమే నీ సంకల్పంగా చేసుకొని శరణాగతితో జీవిస్తూఉంటే దేహబుద్ధి నీకు తెలియకుండానే నశిస్తుంది.**

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 11-4-2001, ఐ. భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రాముని రూపంకంటే రామనామం గొప్పది. నిరంతరం రామనామం జపించి పరమపవిత్రులై ముక్తిని పొందినవారు అనేకమంది ఉన్నారు. అయితే మనం ఏ నామం జపించినా ఆ నామంపట్ల మనకు సజీవమైన విశ్వాసంఉంటే, ప్రేమఉంటే మనం తరిస్తాము. పరమేశ్వరుని ఉపాసించటంవలన రాగద్వేషములు తగ్గుతాయి, ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వస్తుంది. పూర్వజన్మలలో ఎవరైతే సత్కర్మను ఆచరించారో, ఎవరికైతే సదాచారంఉందో వారికి ఈ జన్మలో కామక్రోధముల వేగం తక్కువగా ఉంటుంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి శరీరంతో పోరాటంకాదు, మనస్సుతో ఎక్కువ పోరాడవలసి ఉంటుంది. బయట శత్రువులను జయించినవారు వీరులుకాదు. బ్రహ్మానుభవం పొందటానికి నీలోఉన్న ఏ బలహీనతలైతే అడ్డువస్తున్నాయో వాటితో వీరోచితంగా పోరాడి వాటిని నిశ్శేషంగా నాశనం చేసినవాడిని మహావీరుడు అంటారు, వాడే నిజమైన వీరుడు. తల్లికడుపులోనుండి బయటకు వచ్చినది మొదలు స్మశానానికి వెళ్ళేవరకు ఎవరి జీవితం ఒకేలాగ సాగదు. జయం, అపజయం వస్తూఉంటాయి. సుఖదుఃఖాలు వస్తూఉంటాయి. వీటి అన్నింటిని సమన్వయం చేసుకొంటూ దైనందినజీవితంలో ఎలా నిదానంగా జీవించాలో, మన జీవనవిధానం ఎలాఉండాలో రామచంద్రమూర్తిని చూసినేర్చుకోవచ్చు. ఆయన భగవంతుడే అయినప్పటికి సామాన్యమానవుడు ఎన్నికష్టాలు అనుభవిస్తాడో ఆయనకూడా వాటిని అనుభవించి రామాయణంలో మనకు చూపించాడు. మనం అనుకొన్నది జరుగకపోతే కంగారుపడతాము, నిరుత్సాహపడతాము, దుఃఖంవస్తుంది. రామునికి పట్టాభిషేకం జరుగవలసిఉంది కాని ఆయనను అరణ్యవాసానికి వెళ్ళమని ఆజ్ఞ వస్తుంది. అప్పుడుకూడా రాముడు సమస్థితిని కోల్పోలేదు. జీవితంలోవచ్చే సంఘటనలను సమన్వయం చేసుకొంటూ సమస్థితిని కోల్పోకుండా కాపాడుకొంటూ జీవకోటికి ఆదర్శంగా రామచంద్రమూర్తి నిలిచాడు. అరణ్యవాస సమయంలో సీతారాములు అనేకమంది మహర్షులను దర్శించి వారికి సేవచేసి వారి ఆశీస్సులనుపొంది ఆ సమయం వృధాపోకుండా ఉపయోగించుకొన్నారు. అంటే

మనంకూడా వ్యతిరేఖపరిస్థితులను అలా ఉపయోగించుకోవాలి అని చెప్పటం. పతంజలి యోగసూత్రములలో అపరిగ్రహం అనిచెప్పారు. అపరిగ్రహంఅంటే ఎవరైనా మంచినీరు ఇస్తే మేము పుచ్చుకోము అనటంకాదు. మన దగ్గర అవసరాలకు మించిన సంపదఉంటే దానిని దగ్గర పెట్టుకోకూడదు, దానివలన ఆశ పెరిగే ప్రమాదంఉంది. ఆశ, క్రూరత్వం ఉన్నచోటనుండి హింస మొదలవుతుంది. అందువలన ఆశ ఉండకూడదని అపరిగ్రహ సూత్రం బోధించారు.

మనకు అన్ని సదుపాయములు ఉండి ఈశ్వరునిమీద ప్రేమలేదు అనుకోండి ఇంక జీవితంలో మనం సాధించేది ఏదీలేదు. ధనం, అధికారం సంపాదించటమే పురోభివృద్ధి అనుకోవద్దు. ఆరోగ్యం కాపాడుకొంటూ, శాంతిని కోల్పోకుండా చూసుకొంటూ, పరమేశ్వరుని పట్ల సజీవమైన విశ్వాసం కలిగిఉంటే అది నిజమైన పురోగతి. బాహ్యంగా మీకు ఎన్ని సంపదలు ఉన్నా భక్తిలేని జీవితం సున్నా. అందువలన భక్తిని కాపాడుకొంటూరావాలి. శరణాగతి చెందినవాడికి సొంత ఇష్టంఅంటూ ఏమీఉండదు, సొంత సంకల్పం ఏమీఉండదు. ఈశ్వర సంకల్పమే తన సంకల్పం అనుకొంటాడు. అంతా ఈశ్వరసంకల్పాన్నిబట్టే నడుస్తోంది. అందువలన నీకు సొంత ఇష్టాలు ఉండకూడదు. భగవంతుని ఇష్టమే నీ ఇష్టం చేసుకోవాలి. భగవంతుని సంకల్పమే నీ సంకల్పంగా చేసుకొని జీవిస్తూఉంటే దేహబుద్ధి నీకు తెలియకుండానే నశిస్తుంది. దేహబుద్ధిని ఒకేసారి తొలగించుకోలేము, నెమ్మదిగా తగ్గించుకొంటూ రావాలి. అసలు ప్రయత్నం ప్రారంభిస్తే నెమ్మదిగా తొలగిపోతుంది. మీకు నచ్చిన మార్గంలో ప్రయాణించి దేహబుద్ధిని తొలగించుకోవాలి, అనుకరణవద్దు. ఇతరులు బాగుపడటానికి మనం సహాయసహకారములు అందించకపోయినా వారంతటవారు కష్టపడి అభివృద్ధిలోనికి వస్తూఉంటే చూసి సంతోషించే శక్తిలేనివారికి జ్ఞానంఏమిటి? భక్తిఏమిటి? అలా సంతోషించే అర్హత లేనివాడికి భక్తికుదరదు. దేహానికి పరిమితమైన బుద్ధి ఉన్నవాడు నిరాకారాన్ని ఆరాధించటం కష్టం. అందుచేత రూపాన్ని ఆరాధించగా, ఆరాధించగా రూపంలేని స్థితికి ఆయనే చేరుస్తాడు. మనవుడిని దుఃఖంలేని స్థితికి తీసుకొనివెళ్లటానికే మహాప్రవక్తలు అందరూ ప్రయత్నం చేసారు. ఈ దుఃఖానికి కారణం ఏమిటి? ఈ దుఃఖం నాకు ఎందుకు వస్తోంది? అని విచారణచేసి తొలగించుకొన్నా దుఃఖం పోతుంది, లేదా ఏ మనస్సుకైతే దుఃఖంవస్తోందో ఆ మనస్సును ఈశ్వరుని పాదాలకు సమర్పించినా దుఃఖంపోతుంది. సుఖం, దుఃఖం ఇవి అన్నీ తలంపులే. ఈ తలంపులన్నీ మూలతలంపును పట్టుకొనిఉన్నాయి. దేహము నేను అనేది

మూలతలంపు. ఆ మూలతలంపును దాని మూలంలోనికి పంపటానికి ప్రయత్నంచేయాలి. అదే సాధన, మూలతలంపు మూలంలోనే భగవంతుడు ఉన్నాడు అందువలన అక్కడకు చేరేవరకు ప్రయత్నం చేయవలసిందే.

మనందరం మోక్షంకోసం ప్రయత్నం చేస్తున్నాము. అయితే ఫలం వచ్చినప్పడు ఎంత సంతోషంగా ఉంటారో, ప్రయత్నం చేసేటప్పడకూడా అంత సంతోషంగాఉంటే మీ ప్రయత్నం ఫలిస్తుంది. మనకు సొంత ఆలోచన లేకపోవటంకూడా ఒకదోషం. చెప్పడు మాటలు వినటంవలన మనం పాడైపోతాము. నువ్వు ఏదైనా పొరపాటుచేసినా నాకు ఇష్టమేగాని సొంత ఆలోచనను విడిచిపెట్టవద్దు అని వివేకానంద చెప్పారు. సొంతబుద్ధిని కాపాడుకొంటే వివేకం పెరుగుతుంది. వివేకంవలన విచక్షణ పెరిగి, ఈశ్వరుని వాక్యంపట్ల గౌరవంకలిగి, ప్రేమకలిగి లోపలున్న సద్వస్తువు కొంచెం, కొంచెంగా అనుభవంలోనికి వస్తుంది. మీరు ఏదోఒకటి అనుకోకుండా ఉండలేరు. నేనుఅది, నేనుఇది, నేను అంతటివాడిని, నేను ఇంతటివాడిని ఇలా అనుకొంటూ ఉంటారు అలా అనుకోవటమే ఆత్మజ్ఞానానికి అడ్డు. నిజమైన నేను ఏమీఅనుకోదు. అబద్ధమైన నేనే అన్నీ అనుకొంటుంది. ఇలా అనుకోవటం మానేసి ఊరక ఉండటమే ఆత్మజ్ఞానం. ఏమీఅనుకోకుండా ఉండటానికే ధ్యానం, జపం, శరణాగతి ఇవిఅన్నీ. దేహం మరణించేవరకు నేను, నాది అనుకోవటం తప్ప మనకు ఇంకో పనిలేదు. ఇలా అనుకొనేదంతా సున్నా ఉన్నది చైతన్యం ఒక్కటే. అది తప్పించి ఏదీలేదు అని నీ బుద్ధికి గ్రహింపురావాలి. అప్పడు దానికోసం నీ బుద్ధి ప్రయత్నం చేస్తుంది. పొగడ్త, విమర్శ రెండూ వికారాలే, ఇవి స్వప్న సమానమే. ఈరెండూ దొంగనేనుకే. నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణించి ఈ దొంగనేనులోనుండి విడుదలపొందాలి. ఎవరిని చులకనగా చూడవద్దు, అల్పంగాచూడవద్దు. రావణాసురుడు ఎవరివలన మరణం రాకూడదుఅని వరంపొంది నరుడిని వదిలేసాడు. అతని ఉద్దేశంలో నరుడుఅంటే చులకన, వీరు ఏమిచేయగలరు అని అల్పభావన. చివరకు పరమాత్మ మానవ రూపంలోవచ్చి వధించాడు. అందుచేత ఎవరిపట్ల అల్పభావన పనికిరాదు.

# మనంకానిదానిమీద మనస్సు వాలకపోవటం వైరాగ్యం, అదే జ్ఞానం

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 5-7-2001, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు గురుపూర్ణిమ. ఈ రోజున ఎవరి గురువును వారు గౌరవించుకొంటారు. ఇది మన భారతీయ సాంప్రదాయం. ఆచార్యుడు శిష్యుడిని అమితంగా ప్రేమిస్తాడు. ఆచార్యుడి ప్రేమ అపారం. ఆచార్యుడికి శిష్యులమీద ప్రేమ ఎలా ఉంటుందో చూడండి. కొంతమంది శిష్యులకు ఆచార్యుడు ఆత్మవిద్య బోధిస్తాడు. తరువాత వారు ఇంటికివెళ్ళే సమయంలో శిష్యులతో మీరు నాదగ్గర 5 సం॥లు విద్య నేర్చుకొన్నారు, నాతో కలిసి ఉన్నారు. ఈ కాలంలో మీకు నాలో ఏమైనా దోషాలు కనిపిస్తే ఆ దోషాలకు దూరంగా ఉండండి అని చెపుతాడు. గురువుకు శిష్యులమీద అంతప్రేమ ఉంటుంది. ఆచార్యుడు శిష్యులకోసం ఏడుస్తాడు. కబీర్ దేశప్రజల కోసం ఏడ్చాడు అని చెపుతారు. మనకోసం మనం ఏడిస్తే రోగులమవుతాము. సమాజంకోసం, భగవంతుడికోసం ఏడిస్తే యోగులమవుతాము. ఆచార్యుడు కేవలము మనలను విద్యావంతులను చేయటమేకాదు భౌతికంగా, ఆధ్యాత్మికంగా బలవంతులను చేస్తాడు. ఆధ్యాత్మికంగా మనం చిన్నపిల్లలము కాబట్టి ఇది ఆధ్యాత్మికం, ఇది భౌతికం అని మనకు అనిపిస్తుంది. మనం ప్రేమతోచూస్తే ఆధ్యాత్మికదృష్టితోచూస్తే భౌతికంకూడా ఆధ్యాత్మికం అయిపోతుంది. ఎవడు బలవంతుడుఅంటే మనకు ఉద్రేకంవస్తూ ఉంటుంది, కోపంవస్తూ ఉంటుంది, చిరాకులు వస్తూఉంటాయి ఎన్ని ఉద్రేకాలువచ్చినా, మనస్సు ఆవేశానికి గురిఅయినా నీ తలంపులోగాని, నీ ఆలోచనలోగాని, నీమాటలోగాని, నీ ప్రవర్తనలోగాని గాడి తప్పకుండాఉంటే నీవు బలవంతుడవు అవుతావు అని ఉపనిషత్తులో ఆచార్యుడు శిష్యునికి చెపుతాడు. మనంకూడా బుద్ధుడంతటివాళ్ళం అవ్వవచ్చు. బుద్ధిత్వం అంటే ఒక వ్యక్తికాదు అది ఒకపదవి, ఒక నిర్వాణస్థితి. అది పొందినవాడు బుద్ధుడవుతాడు. అయితే ఎవడు బుద్ధుడవుతాడు అంటే వాడు బోధించినది, శ్రవణం చేసినది ఆచరించగలిగితే వాడు బుద్ధుడవుతాడు.

ఎందరో మహానుభావులు, ఈ మహానుభావులు అందరికీ మహానుభావుడు నారాయణుడు. వ్యాసుడుకూడా నారాయణుడే అని చెపుతారు. వ్యాసపూర్ణిమను అంటే వ్యాసుడు శరీరం ధరించిన రోజును గురుపూర్ణిమగా పెద్దలు ఏర్పాటుచేసారు. భక్తి విషయం, జ్ఞానం విషయం అటుఉంచండి. మీకు పరిస్థితులు అనుకూలంగాఉన్నా, ప్రతికూలంగాఉన్నా మీరు తెలివిగా జీవిస్తే దుఃఖానికి దూరంగా ఉండవచ్చు. అందువలన వివేకాన్ని పోషించుకోవాలి. ఆచార్యుడు మనకు జ్ఞాననేత్రాన్ని ఇస్తాడు. మనకు రెండునేత్రాలు ఉన్నాయి.

తొలగించమని ఈశ్వరుని ప్రార్థించాలి. అప్పడు అడ్డంకులు తొలగిపోతాయి. మనస్సులోఉన్న మలాన్ని, మాలిన్యాన్ని తొలగించటం ఒక్కభక్తికే సాధ్యం. భక్తితో హృదయాన్ని నింపుకున్నవాడిమాట, చేత నిర్మలంగా ఉంటాయి. భక్తులలో రజోగుణభక్తులు, తమోగుణభక్తులు, సత్వగుణభక్తులు ఉంటారు. వారినందరిని ఆచార్యుడు భరించవలసిందే లేకపోతే ఆయన ఆచార్యుడేకాదు. సత్వగుణ భక్తులను చేర్చుకొనేవాడు ఆచార్యుడుకాదు, పశుపక్ష్యాదులకుకూడా బోధించి తరింపచేసేవాడు ఆచార్యుడు. ఆచార్యుడు అనుగ్రహం కలిగితే ఆయన నోటితో చెప్పకుండానే జరగవలసింది జరిగిపోతూ ఉంటుంది.

శరణాగతి వలన ఈశ్వరానుగ్రహం తొందరగా వస్తుందికదా అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమిచెపుతున్నారుఅంటే అనుగ్రహం తొందరగా వస్తుందా, ఏ నిష్పత్తిలో వస్తుంది అనే ప్రశ్నలువద్దు. ముందు శరణాగతి పొందటానికి ప్రయత్నించు. ఒకేసారి పూర్ణశరణాగతిరాదు, పాక్షికంగా శరణాగతి చేసుకొంటూ రావాలి. శరణాగతి చేయటంవలన అసహజస్థితికి దూరమవుతాము, సహజస్థితికి దగ్గరవుతాము. దుఃఖానికి ఇంట్లో పరిస్థితులు కారణం అని అనుకొంటూ ఉంటారు. దేహము నేను అనే మొదటితలంపే దుఃఖానికి కారణం. అది ఒకదుంప, ఆ దుంపే దుఃఖానికి కారణం. ఆ దుంప ఎండిపోతేకాని దుఃఖం నశించదు. దీనినే ఉపనిషత్‌లలో హృదయగ్రంథి అన్నారు. దేహము నీవుకాకపోయినా దేహమే నేను అని ఈ గ్రంథి నీకు అనిపింపజేస్తుంది. ఇది పైన కొబ్బరినూనె వ్రాస్తే పోయేదికాదు. ఆ గ్రంథి తెగేవరకూ నీవు ప్రయత్నం చేయవలసిందే. ఆ గ్రంథి తెగేవరకూ అజ్ఞానం అనే అడవిలోనుండి బయటకు రాలేవు. హృదయగ్రంథిని ఛేదించటంవైపే మన సాధనను కేంద్రీకరించాలి. దేహము నేను అనేతలంపు ఉన్నంతకాలం ఏదో కోరిక వస్తూనే ఉంటుంది. ఆ దుంప పూర్తిగా ం 'డిపోయేవరకు దానిని నమ్మటానికి వీలులేదు. ఇది ఒక పాపపుదుంప. ఇక్కడనుండే పాపం ప్రారంభమవుతుంది. క్రైస్తవమతంలో దీనిని సైతాను అంటారు. దేహము నేను అనే మొదటితలంపును శిలువవెయ్యి అప్పడు నీకు బ్రహ్మానుభవం కలుగుతుంది. దేహాభిమానంలోనుండి నిన్ను విడుదలచేసేది పనిగాని దేహాభిమానాన్ని పెంచేది పనికాదు. నీవు చేసేపని దేహాభిమానంనుండి విడుదల పొందటానికి నీకు సహకరించాలి.

అద్వైతం బోధించేదికాదు, అది అనుభవానికి సంబంధించినది. అద్వైతం అనుభవంలోనికి వచ్చినప్పడు దానివిలువ మనకు తెలుస్తుంది. ఎంతో పూర్వపుణ్యం ఉంటేగాని అద్వైతానుభవం మాట అటు ఉంచండి అద్వైతవాసనేరాదు అని ఆచార్యులవారు చెప్పారు. కొంతమందిని రంపంపెట్టి కోసినా ద్వైతబుద్ధిలోనుండి అద్వైతంలోనికి రాలేరు. వారూ మంచివారేగాని బుద్ధి ఆ గాడిలోనుండి తప్పకోదు. లోకంలో అక్కడ చెడ్డవారు ఉన్నారు,

ఇక్కడ చెడ్డవారు ఉన్నారు అంటావు. వారు ఉన్నారని ఈశ్వరుడికి తెలుసుకదా. వారిని ఈశ్వరుడే భరిస్తున్నాడు కదా నీకు వచ్చిన ఇబ్బంది ఏమిటి? పైగా వారు ఉండటం నీకు అవసరం. నీలో ఎంతోకొంత మంచితనం ఉంది అనుకో వారు లేకపోతే ఆ మంచితనం పెరగదు. నిన్ను ఇంకా మంచివాడిని చేయటానికి, నీలో మంచి పెరగటానికి వారు సహకరిస్తారు అని భగవాన్ చెప్పారు. మనస్సు అంటే అనేక తలంపుల సమూహము అని చెపుతారు. కాని దేహము నేను అనే మొదటి తలంపే మనస్సు అది లేకపోతే ఏదీలేదు అంటారు భగవాన్. అది పోయినవాడు శరీరం ఉండగానే శరీరంలోనుండి విడిపోతాడు వారు ఉంటారు, ఉన్నదేదో వారికి తెలుస్తూ ఉంటుంది. ఈ దేహం ఉండటం వలన వారికి ఏమీ లాభంలేదు, ఈ దేహం పోవటంవలన వారికి ఏమీ నష్టంలేదు. మూలతలంపుఉంటే నువ్వుఉన్నావు, నేను ఉన్నాను, జన్మలు ఉన్నాయి, పుణ్యంఉంది, పాపంఉంది, దేవతలు ఉన్నారు, నీ ప్రార్ధనలు ఉన్నాయి. అది లేకపోతే ఏదీలేదు. మూలతలంపు ఎప్పుడైతే నశించిందో అప్పుడు నువ్వు ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తుంది. నువ్వు ఉన్నావన్న సంగతి నీకు అనుభవంలోనికి వచ్చాక లోకం కనిపించినా, కనిపించకపోయినా నీకు నష్టంలేదు, అప్పుడు నీవు ఎలా ఉంటావుఅంటే సుఖమేసుఖము, శాంతేశాంతి. జ్ఞాని సమాజంలోఉన్న గొడవలుచూస్తూ ఉంటాడు. జ్ఞానికి లోకంలోఉన్న దేహాలుఅన్నీ తెరమీదఉన్న బొమ్మలవంటివి. మనం సినిమా తెరమీదఉన్న బొమ్మలను ఎలా చూస్తామో జ్ఞాని ఈలోకంలోఉన్న దేహాలను అలాచూస్తాడు. సముద్రంలో ఆ కెరటంవచ్చి ఈ కెరటాన్నికొట్టినా, ఇది వెళ్ళి దానిని కొట్టినా అదీనీరే, ఇదీనీరే. అంతా సముద్రంలో భాగమే. జ్ఞానికూడా ఈ లోకాన్ని అలాచూస్తాడు జ్ఞానికి ఇదిఅంతా బొమ్మలాట. చింతవద్దు, చింతన పెంచుకోండి అని వేమన చెప్పాడు, బెంగవద్దు, వివేకాన్ని పెంచుకోండి.

భగవంతుడు అగోచరుడు మనకు ఎక్కడ కనబడతాడు అని అంటారు భగవంతుడు అహంకారికి అగోచరుడుకాని నిరహంకారికి గోచరుడే. అసలు భగవంతుడు ఉన్నాడు కాబట్టి మహాత్ములకు, ఋషులకు వ్యక్తమవుతున్నాడు. ఆయనే లేకపోతే ఎవరికి వ్యక్తంకాడు. ఆయన ఉన్నాడు కాబట్టి మనలో అహంకారం నశిస్తే మనకూ వ్యక్తమవుతాడు. దేవునికంటే మనలను ప్రేమించేవారు ఎవరు ఉంటారు? ఎవరూ ఉండరుకాని ఉన్నారు అని నీవు అనుకొంటున్నావు. పరమేశ్వరునికి మనపట్ల ఎంతప్రేమఉందో, ఎంత ఆప్యాయతఉందో అంతేప్రేమ ఆయనమీద మనకు ఉంటే కొన్ని క్షణాలుచాలు, మనం ఆయనలో ఐక్యమవుతాము. ఈశ్వరుడిమీద ప్రేమ తగ్గింది అనుకో మనం ఏదో ప్రలోభంలో పడతాము. అత్తగారిమీద కోడలికి కోపం వచ్చింది అనుకోండి. కోపంవచ్చిన తరువాత ఆవిడలో లోపాలు వెతకటం ప్రారంభిస్తుంది.

# జ్ఞానసముపార్జనకు జిజ్ఞాస ప్రధానం

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 31-7-2001, పాలకొల్లు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

లోకంతో సంబంధంలేకుండా, సమాజంతో సంబంధంలేకుండా మనం ఉండలేము. ఎక్కడికివెళ్ళినా సమాజం ఉంటుంది, లోకం ఉంటుంది. లోకాన్నికూడా గురువుగా తీసుకొంటూ లోకంమధ్యలో, సమాజంమధ్యలో ఉండి మనం తరించాలి. సమాజం మధ్యలోఉంటూ జనన మరణములకు అతీతంగా జీవించాలి. వీటికి అతీతంగా జీవించాలంటే ముందు శాంతిని కాపాడుకొంటూ, కృషిచేయాలి. శాంతిని కాపాడుకొంటూ జీవించటంవలన శక్తి కలుగుతుంది. మనం చేసేపని నిర్మలంగా ఉండాలి. మనం మాట్లాడేమాట నిర్మలంగా, నిశ్చలంగా ఉండాలి. మనం మాట్లాడేమాట, చేత అహంభావనతోచేస్తే మనస్సులో ముద్రలు పడతాయి. మనస్సులోపడిన ముద్రలు పునర్జన్మకు కారణం అవుతాయి. అందువలన మనం అహంభావనరహితంగా పనిచేయాలి, అహంభావనరహితంగా మాట్లాడాలి. గురువు నీలోపలేఉన్నాడు, పనిచేస్తున్నాడు. నీలోపలఉన్న చైతన్యమే నిజమైనగురువు. గురువు బోధస్వరూపుడేకాదు అనుగ్రహస్వరూపుడు. ఆయన బోధించటమేకాదు నిన్ను అనుగ్రహిస్తూ ఉంటాడు. నీపట్ల దయచూపిస్తూ ఉంటాడు. లోపలనుండి నిన్ను గైడ్‌చేస్తూఉంటాడు. బయట గురువు నిన్ను హృదయంలోనికి పంపటానికి చూస్తాడు. అక్కడకువెళ్ళి లోపలఉన్న గురువును దర్శిస్తే అదేబ్రహ్మంఅని, అదేసర్వస్వంఅని నీకు అనుభవంలోనికి వస్తుంది. గురువుఅంటే పరాయివాడు అనుకోవద్దు. నీవు భగవంతుడిని ఆరాధించగా, ఆరాధించగా ఆయనే గురురూపంలోవచ్చి నిన్ను గైడ్‌చేస్తాడు. భగవంతుడుఅన్నా, గురువుఅన్నా, అనుగ్రహంఅన్నా అన్నీ ఒక్కటే. గురువుఅంటే శాంతి, ఆనందం, అనుగ్రహం, గురువు ఏమిచేసినా ఆనందమే, ఆయన కదలికలు అన్నీ ఆనందమే ఎందుచేతనంటే ఆనందమే ఆ రూపం ధరించి వచ్చింది.

రాగద్వేషములు, లాభనష్టములు, హెచ్చుతగ్గులు ఇవిఅన్నీ అహంభావనకే. అహంభావన నశించినవాడికి లాభనష్టములతో పనిలేదు. అయినా పనిచేస్తూనే ఉంటాడు. ఆ పనిచేయటం వలన వచ్చే ఫలం వాడికి అంటదు. నేను అది చేసాను, అప్పుడు చాలాకష్టపడ్డాను అందువలన ఇప్పుడు భోగం అనుభవిస్తున్నాను అని ఇలాఅనుకొంటూ ఉంటాము. దీనివలన అహంభావన

పెరిగిపోతుంది, పునర్జన్మహేతువులు పెరిగిపోతున్నాయిఅని మనకు తెలియటంలేదు. ఇది చాలా దురదృష్టకరం. నేను అది సాధించాను, ఇది నావలననే అయ్యింది అనుకోవటం కర్తృత్వం. అప్పడు అలాచేయటంవలన ఇప్పడు భోగం అనుభవిస్తున్నాను అనుకోవటం భోక్తృత్వం. వీటివలన లోపల అహంభావన పెరిగిపోతూఉంటుంది. రాగం ఒకతలంపు, ద్వేషం ఒకతలంపు, దుఃఖం ఒకతలంపు, చావు ఒకతలంపు అన్నీ తలంపులే. ఈ తలంపులుఅన్నీ మనస్సులోనుండి వస్తున్నాయి. ఈ మనస్సు నశిస్తే ఉన్నదిఉన్నట్లు నీకు వ్యక్తమవుతుంది, నిర్వాణస్థితి నీకు అందుతుంది. దానికి నీవు నిర్మలంగా మాట్లాడాలి, నిశ్చలంగాఉండాలి, లోపల శాంతిని కాపాడుకోవాలి, ఎవరైనా ఉద్రేకపరచినా తొందరగా ఉద్రేకానికి గురిఅవ్వకూడదు, సత్పురుషుల సహవాసం విడిచిపెట్టకూడదు. సత్పురుషుల సహవాసంవలన వారి వైబ్రేషన్స్ మనమీద పనిచేస్తాయి. వారిలాగ మనంకూడా చైతన్యస్థాయిని పెంచుకోవాలనే సద్బుద్ధి మనకు కలుగుతుంది. అప్పడు ప్రయత్నంచేసి ఆ స్థాయికి మనంకూడా చేరుకొంటాము.

మాకు రోజులు బాగావెళ్లిపోతున్నాయి అని చాలామంది అంటూఉంటారు. ఏమి బాగావెళ్లిపోతున్నాయి? చావుకు దగ్గరపడుతున్నారు. కసాయివాడు గొర్రెను చంపటానికి ఎలా లాక్కొనివెళతాడో అలాగ ఆరోజుకారోజు చావు మిమ్మల్ని దగ్గరకు లాక్కొనివెళుతోంది. అయ్యో! చావు దగ్గరపడుతోంది కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి, చనిపోయిన తరువాత చేసేదిఏమీలేదు అనే బుద్ధికూడ మీకు కలగటంలేదు అని భాగవతంలో పరమాత్మ చెప్పాడు. చిల్లరవిషయాలగురించి మీకాలాన్ని, శక్తిని వృధాచేసుకోవద్దు. మీపొట్టకోసం ఏదో వృత్తిచేసుకుంటూ మిగిలిన కాలంఅంతా భగవదనుభవం పొందటానికి ఉపయోగించండి. ఈమధ్య మహేంద్రవాడలో ఒకటీచర్ ఆయన స్నేహితుడిని నాదగ్గరకు తీసుకొనివచ్చి మేము గత 30 సం॥ల నుండి స్నేహంగా ఉంటున్నాము. ఈ 30 సం॥ల కాలంలో మేము ఒక్క భగవంతుని గురించితప్ప, మిగిలిన విషయాలు కుటుంబం గురించిగాని, గ్రామంగురించిగాని ఎప్పడూ మాట్లాడుకోలేదు. మా స్నేహం ఇలాఉందిఅంటే, మేము శాంతిగాఉన్నాము అంటే అదే కారణం అనిచెప్పారు. నాకు ఆశ్చర్యంకలిగింది. మనం రోజూ నిద్రపోయేముందు ఒకటి ఆలోచించుకోవాలి. ఈ రోజు మనం ఎలాగడిపాము? మనకు ఎటువంటి తలంపులు వచ్చాయి? మనకు వచ్చేతలంపులు మనకుగాని, సమాజానికిగాని ఏమైనా ఉపయోగపడతాయా? ఏదైనా ఒక మంచిపనిఅయినా చేసామా? మనం పవిత్రులం

అవ్వటానికి ఎంతవరకు కృషిచేసాము? మనలోఉన్న దోషాలను తొలగించుకోవటానికి ఎంతవరకు కృషిచేసాము? అని ఆరోజు జరిగిన విషయాలుఅన్నీ ఒకసారి మరల చూసుకోవటంవలన అది ఆధ్యాత్మిక అభివృద్ధికి సహకరిస్తుంది. ఆత్మ మన హృదయంలోనే ఉంది. దేహాభిమానంవలన లోపలఉన్న వస్తువు మనకు తెలియటంలేదు. మనం ధర్మాన్ని ఆచరిస్తూ, పెద్దలను గౌరవిస్తూ, సత్కర్మచేసుకొంటూ, భగవంతుని పాదాలను ఆశ్రయిస్తూ ఇలా నెమ్మదిగా వెళుతూఉంటే మనకు శత్రుత్వాలు, మిత్రుత్వాలుపోయి భగవంతుడు మిగులుతాడు, చైతన్యం మిగులుతుంది. అన్నీ మనస్సుయొక్క కల్పితములే. మనస్సుతో కల్పింపబడనివస్తువు, సహజమైనవస్తువు, నిర్మలమైనవస్తువు నీ హృదయంలోనేఉంది. ఉండటమేకాదు అదినీవైఉన్నావు. దానిని అందుకొంటేగాని పునర్జన్మలేని స్థితిని పొందలేవు. నిన్ను అక్కడికి తీసుకొనివెళ్ళటానికే గురువు ప్రయత్నంచేస్తూఉంటాడు. నీ గమ్యంఏమిటో నీకు తెలియకపోయినా గురువుకు తెలుసు.

మనం నేను, నేనుఅనేది అబద్ధమైననేను. ఎప్పుడైతే నీహృదయంలోఉన్న నిజందగ్గరకు వెళ్ళావో ఈ అబద్ధమైననేను చూద్దామన్నా నీకుకనబడదు. నదివెళ్ళి సముద్రంలో కలిసాక ఇదినది అని మనం చెప్పలేము అలాగే ఈజీవుడువెళ్ళి బ్రహ్మంలో కలిసాక వీడుజీవుడు అనిచెప్పటానికి అక్కడ ఏమీమిగలదు. అటువంటి అద్వైతానుభవం నీవు ఈజన్మలోనే పొందవచ్చు. దానికి నీవు కాలంపాడుచేసుకోకుండా కృషిచేయాలి, చిల్లరగొడవలు, రాగద్వేషములువద్దు. నీవుఏదైతేపొందాలో దానినే గమ్యంగా పెట్టుకొని పనిచెయ్యి. ఎవరైనా మహిమలుచూపిస్తూఉంటే వారిదగ్గరకు వెళ్ళవద్దు. మహిమలవలన మీకు దేహాభిమానం పెరుగుతుంది, శాంతికి దూరమవుతారుఅని రామకృష్ణుడు చెప్పాడు. జ్ఞానం పవిత్రమైనది. జ్ఞానంవలన శక్తికలుగుతుంది, మనహృదయంలోఉన్న శాంతిని మనచేతికి పట్టిఇస్తుంది. అటువంటి జ్ఞానసముపార్జనకు ప్రయత్నంచేయండి. మీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణించి జీవలక్షణాలనుండి విడుదలపొందటానికి ప్రయత్నంచేయండి, అనుకరణవద్దు. జ్ఞానసముపార్జనకు డబ్బుతోపనిలేదు. తెలుసుకోవాలనేకాంక్ష లోపలనుండిరావాలి, సత్పురుషుల సహవాసందొరకాలి, సద్గురువుదొరకాలి. పూర్వజన్మలలో ఎంతోకొంత పుణ్యకర్మ ఆచరించకపోతే ఇవిఅన్నీ నీకులభ్యమవుతాయా అని ఆచార్యులవారు అంటున్నారు.

నేను అహంభావరహితంగా మాట్లాడుతూఉంటే అదిమీకు ఉపయోగపడుతుంది,

సమాజానికి ఉపయోగపడుతుంది. అహంభావనతో మాట్లాడితే మీటైము, నాటైము వృధా, అవసరం ఉన్నప్పుడు మాట్లాడాలి. అవసరంలేకుండా మాట్లాడుతూఉంటే దానివలన అబద్ధమైననేను పెరిగిపోతుంది, నిజమైననేనుకు దూరమవుతావు. లోకాన్నిచూసి నీలోపల ఆకర్షింపబడేవాడు ఒకడుఉన్నాడు కాబట్టి లోకాన్నిచూస్తే నీకు ఆకర్షణ కలుగుతోంది. లోకాన్నిచూసి ఆకర్షింబడేవాడు లోపల లేనప్పడు లోకాన్నిచూసినా ఆకర్షణ కలుగదు. గురువు ఏమిచేస్తాడుఅంటే లోకాన్నిచూసి ఆకర్షింపబడేవాడినితీసి ఒకప్రక్కనపెడతాడు. అప్పడు నీవు లోకాన్నిచూసినా అదినిన్ను బంధించదు. మనం ఎలాఉండాలంటే ముందుభగవంతుడు, తరువాతలోకం. ముందు నువ్వుఎవడో నీవు తెలుసుకొని లోకాన్నిచూస్తే అప్పడు లోకం నిన్నుబంధించదు. భగవాన్ ఏమిచెపుతున్నారుఅంటే నువ్వులోకాన్ని చూస్తానంటావుఅనుకో భగవంతునితో కలుపుకొని లోకాన్నిచూడు అనిచెపుతున్నారు. మనరూపాలలో తేడాఉంది, నామాలలో తేడాఉంది, కులాలలో తేడాఉంది, మతాలలోతేడాఉందిగాని వీటిఅన్నింటికి ఆధారంగా మీహృదయంలో ఒక సత్యవస్తువుఉంది. అది నిర్మలంగాఉంది, నిశ్చలంగాఉంది, ఒక్కటిగానేఉంది. నీ తెలివినిపెంచుకొని, బుద్ధిసూక్ష్మతనుపెంచుకొని దానిని పొందటానికి ప్రయత్నంచెయ్యి. నీ హృదయంలోఉన్న వస్తువును తెలుసుకోవటానికి నీ తెలివిని ఉపయోగించుకోలేదుఅనుకో నీ తెలివినిఏమిచేసుకొంటావు. నీ శరీరాన్ని, ఇంద్రియాలను అహంకారంచేతిలోపెట్టి పతనంఅవ్వవద్దు. నీ శరీరాన్ని, ఇంద్రియాలను దేవునిచేతిలో పనిముట్లుగాఉంచు.

నీలో ఏవాసనఉందో ఇతరులకు తెలియకపోయినా నీకుతెలుస్తూఉంటుంది. ఆ వాసన తొలగించుకోవటానికి ప్రయత్నంచెయ్యి. నీప్రయత్నమే, నీకృషే కృపకింద మారుతుంది. నీకృషి దేవునిదయకు కారణమయ్యి, నీలోఉన్న బరువైన వాసనలనే దుంగలను భగవంతుడే బయటకు లాగి కాల్చి బూడిదచేస్తాడు. అందువలన ప్రయత్నం మానవద్దు. నీవు బాగుపడటానికి ఎంతోకొంత ప్రయత్నంచేయకపోతే ఆమాధవుడు మాత్రం ఏమిచేస్తాడు. ఈ ప్రయత్నం ఎప్పడూచేయాలి అనిఅనుకోవద్దు. సాధన పేరుమీద ఎంతోకొంత బాధఉండవచ్చు. గమ్యాన్ని చేరినతరువాత మీరుపడ్డ కష్టంఅంతా మర్చిపోతారు. జలపాతంలోనుండి నీరు ఎలావస్తూఉంటుందో అలాగ దేహవాసన, లోకవాసన లేనివాడిదగ్గరనుండి జ్ఞానం సంపాదించుకోవాలనే కాంక్ష కలుగుతుంది. అప్పడు ఏ బలహీనతలయితే మిమ్మలను

పీడిస్తున్నాయో వాటిలోనుండి బయటపడతారు. జ్ఞానిసమక్షంలో మనకు అటువంటి సహాయసహకారములు అందుతాయి. ఎక్కడినుండివచ్చామో మనకు తెలియదు. దేహప్రారబ్దం ప్రకారం ఇప్పడు దేహం ఇక్కడపనిచేస్తోంది. ఈ దేహం చనిపోయాక ఎక్కడికోవెళ్ళిపోతాము. దేహగతమైననేను ఉన్నంతకాలం ఈ రాకపోకలు తప్పవు. హృదయంలోఉన్న చావులేనివస్తువు నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు నేనుఎక్కడికివెళతాను, నేనులేనిచోటుఉంటేకదా వెళ్ళటానికి, అంతటా నేనుఉన్నానుకదా అనే అనుభవం నీకు కలుగుతుంది. అది కడసారిజన్మ. అద్దాన్ని శుభ్రంచేస్తే నీప్రతిబింబం ఎంతస్పష్టంగా కనిపిస్తుందో అలాగనీవు పరమపవిత్రుడవుఅయితే నీలోపలున్న సద్వస్తువు అంతస్పష్టంగా నీకు గోచరిస్తుంది. అప్పడునీకు అమృతానుభవం కలుగుతుంది. అప్పడు రాకపోకలతో నీకుపనిలేదు. మహాత్ములతో సహవాసం అటువంటి ఉన్నతస్థితికి నిన్నుమోసుకొనిపోతుంది. సత్పురుషుల సహవాసం అంతశక్తివంతమైనది. లోపలఉన్న సద్వస్తువు నీకు అనుభవంలోఉంటేసరే లేకపోతే బాహ్యంగాఉన్న సత్పురుషులతో సహవాసం చేయటంవలన లోపలఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి వారిద్వారా సహజంగా నీకు సహాయసహకారములు అందుతాయి. డబ్బు సంపాదనకోసం, సంపాదించినడబ్బును రక్షించుకోవటంకోసం మనం ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటాము. మరి జ్ఞానసముపార్జనకోసం ఇంక ఎన్నిజాగ్రత్తలు తీసుకోవాలో ఆలోచించుకోండి.

అజ్ఞానంలోనుండి బయటకు రావటానికి ఎన్నిరకాలుగా ప్రయత్నంచేస్తావో అన్నిరకాలుగా ప్రయత్నంచెయ్యి, ఎన్ని బాధలుపడతావో అన్నిబాధలుపడు. అజ్ఞానంఎంత పీడిస్తోందో నీకు తెలుస్తోందికదా ఆ పీడలోనుండి బయటకురా. నీ శరీరం మరణించాక నీవువెళ్ళేలోకాలు నీమనస్సు ఎంతనిజమో ఆ లోకాలుకూడా అంతేనిజం. అవి వ్యవహారికసత్యములే. నీ మనస్సుతో ఆలోచించేది, నీకళ్ళతోచూసేది, నీచెవులతోవినేది, నీమనస్సు ఎంతనిజమో అవికూడా అంతేనిజం కానిఅవి పారమార్ధిక సత్యాలుకాదు. శరీరం చనిపోయేటప్పడు నేను చనిపోతున్నాను అని శరీరం అనుకోవటంలేదు, ఈ శరీరం నేనుఅనే తలంపు అనుకొంటోంది. అదే మూలతలంపు. మూలతలంపు మూలంలోనేబ్రహ్మంఉంది. నీ శరీరంఉండగా ఆ మూలతలంపు దానిమూలం అయిన బ్రహ్మంలో ఐక్యం అవ్వాలి. అప్పడు నీశరీరం చనిపోతున్నా నేను చనిపోతున్నాను అని నీవుఅనుకోవు. ఎందుచేతనంటే నేను చనిపోతున్నాను అనుకొనే

నేనుఅనేతలంపు బ్రహ్మంలో కలిసిపోయింది. బ్రహ్మంకు చావులేదు కాబట్టి నీ శరీరంపోయినా నీవు ఉంటావు అని నీకు తెలుస్తుంది. అప్పుడు నీ శరీరం పోయినా నీకు దుఃఖంరాదు. అది జీవన్ముక్తస్థితి. ఇది ఊహకాదు. ఇది అనుభవంలోనికి వస్తుంది. దీనిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నంచేయండి. శరీరం ఉండగా ఒకగదిలోనుండి ఇంకోగదిలోనికి వెళ్లటం ఎలా ఉంటుందో చావుఅంటే జీవుడు ఒకశరీరం విడిచిపెట్టి ఇంకోశరీరంలోనికి వెళ్లటం. నీవు జీవన్ముక్తుడవుఅయితే ఇదిఏమీ ఉండదు ఎందుచేతనంటే ఈ వెళ్లేవాడు శాంతిసాగరంలో, జ్ఞానసాగరంలో అణిగిపోతాడు. అలా అణిగిపోయినప్పడు నీమొఖం ఎంతశాంతిగాఉంటుందో, ఎంతకాంతిఉంటుందో, ఎంతసహజంగాఉంటుందో ఆ అందాలు ఎవరు వర్ణించగలరు.

అవతారపురుషులు, జ్ఞానులు, గురువులు మీతోమామూలుగా మాట్లాడుతూ ఉంటారు. మీరు ఎలా ఉన్నారు, ఏమిచేస్తున్నారు అని ఇలామాట్లాడుతూ ఉంటారు, మీతో కలిసి తిరుగుతూఉంటారు. ఇలా మీతో మాట్లాడుతూ, మీతో తిరుగుతూ మీకు తెలియకుండా మీదేహాభిమానాన్ని బలహీనపరుస్తూఉంటారు. అది వారిగొప్పతనం. సత్పురుషుల సహవాసంవలన అహంకారం ఆరోజుకారోజు బలహీనపడుతుంది. సత్పురుషులకు సేవచేస్తున్నావు అనుకో లోపలఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి ఆ సేవ నీకు సహకరిస్తుంది. ఏమీ ఆశించకుండా ఇంట్లోఉన్న పెద్దలకు నిష్కామంగా సేవచేస్తున్నావుఅనుకో అదికూడా నీ హృదయంలోఉన్న వస్తువును తెలుసుకోవటానికి నీకు సహకరిస్తుంది. ఇప్పడు నీమనస్సు నీస్వాధీనంలోలేదు. నీమనస్సు స్వాధీనంలోనికి రావటానికి సత్పురుషులు, గురువు నీకు సహకరిస్తారు. నీమనస్సును స్వాధీనంలోనికి తీసుకొనిరావటమేకాదు హృదయంలోఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి నీమనస్సును ప్రిపేర్‌చేస్తారు. మనస్సులోపలకు వెళ్లేటప్పడు ఏదోఆకర్షణ జ్ఞాపకంవచ్చి బయటకువచ్చేస్తుంది. అందుచేత ఆ ఆకర్షణలనుండి నీమనస్సును విడుదలచేసి గమ్యంచేరేవరకు నీకూడాఉండి నడిపించేవాడే గురువు. మధ్యలోనిన్ను విడిచిపెట్టడు. ఈ సృష్టిలో అన్ని లాభాలలోకి ఆత్మలాభం గొప్పది. ఆత్మవిశ్వాసం లేనివాడికి ఆత్మలాభం కలుగదు. మీరు భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను అభివృద్ధిలోనికి రావాలంటే మాటనిర్మలంగాఉండాలి, చేతనిర్మలంగాఉండాలి, మనస్సునిశ్చలంగాఉండాలి. ఇలాఉంటే ఆరోజుకారోజు అభివృద్ధిలోనికి వస్తారు. అప్పడు దేవుని అనుగ్రహానికి పాత్రులవుతారు. దేవుని అనుగ్రహానికి పాత్రులయినప్పడు ఆయన స్వరూపాన్ని మీకుఇస్తాడు.

# పాఠకులకు మనవి

## రమణ భాస్కర సంవత్సర చందా రు. 150/-

## అయిదు సంవత్సరముల చందా రు. 700/-

సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనాలను అందించటానికి మేము చేస్తున్న కృషిని ప్రోత్సహిస్తున్న పాఠకులకు ధన్యవాదములు. పోస్టల్ చార్జీలు పెరిగిన కారణంగా ది. 23-9-2001 (సద్గురు శ్రీ నాన్నగారి జన్మదినోత్సవం) నుండి సంవత్సర చందా రూ॥ 150/- లుగా నిర్ణయించడమైనది. మీరు చెల్లించిన సంవత్సర చందాకు ది. 23-9-2002 వరకు క్రమం తప్పకుండా ముద్రించిన పత్రికలు అందుతాయి. గమనించగలరు. మీరు యం.ఓ / డి.డి. / నగదు రూపంగా పంపించవలసిన చిరునామా :

**బిహెచ్.వి. సుబ్బరాజు**
("రమణ భాస్కర" కొరకు)
శ్రీ రమణ క్షేత్రం, **జిన్నూరు - 534 265**
ప॥గో॥ జిల్లా, ఆంధ్రప్రదేశ్

---

**కూపన్**

ఎడిటర్ గారికి,

నేను రమణభాస్కర సంవత్సర చందా నిమిత్తం రూ॥150/-లు (అక్షరాలా నూటయాబది రూపాయలు మాత్రమే) యం.ఒ./డి.డి./నగదు పంపించుచున్నాను. క్రమం తప్పకుండా ప్రతులు పంపించగలరు.

(ది. 23-9-2001 నుండి 22-9-2002 వరకు)


పేరు ..............................................................

తండ్రి / భర్త ..............................................................

డోర్ నెం. .............................................. వీధి/రోడ్ పేరు..............................

గ్రామం .............................................. పిన్ కోడ్..............................

మండలం .............................................. జిల్లా..............................



శ్రీ రమణాశ్రమం, తిరువన్నామలై



ఆంధ్రాశ్రమం, తిరువన్నామలై



శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

**REGISTERED NEWS PAPER** RNI NO. APTEL/1999/1667-POSTAL REGN.NO. AP/VJA/32/5/2000



To

**A. Lakshmi**
Plot No. 150, Rao & Raju Colony
Banjara Hills, Road No. 2
HYDERABAD - 500 034

*If undelivered please return to :*

**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM,
**JINNURU - 534 265.** W.G. Dt. A.P.

Editor, Printer, Publisher : **P.S. RAMA RAJU**
Lakshmi Modern Rice Mill, Ullamparru, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 08814-24589, 24689
Printed at : **SHRIRAM GRAPHICS**, Bank Street, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 22438, 24278